క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజయం సాధించిన నందిగామ జట్టు

నందిగామ: రామలింగేశ్వరనగర్‌లో సంక్రాంతి వేడుకల్లో భాగంగా నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. చివరి రోజు జట్ల మధ్య పోటీ జరిగింది. పోటీలో నందిగామ ఎస్‌హెచ్‌ఓ సతీష్ టీం విజయం సాధించింది.

ఘనంగా అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జ్యోతులతో పల్లకీ సేవ, తెప్పోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మధురానగర్ పురవీధులలో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. దారి పొడవునా మహిళలు హారతులు ఇస్తూ, పసుపునీళ్లుపోసి స్వాగతం పలికారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

మాయావతి జన్మదిన వేడుకలు

నందిగామ: స్థానికంగా బహుజన సేవాసమితి(బీఎస్ఎస్) ఆధ్వర్యాన బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షురాలు మాయావతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి సూర్యం, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్, స్నేహ క్లబ్ గవర్నర్ కె.జెడ్.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరు పట్టణానికి చెందిన మేకల అనంతలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు రూ.10,116 ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆటో ఢీకొనడంతో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుడు సోమవారం మృతిచెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు గిరిపురానికి చెందిన బంగారు గణేష్(43) అనే పారిశుధ్య కార్మికుడు ఈ నెల 11వ తేదీన ఉదయం పశువుల ఆస్పత్రి సమీపంలో నేతాజీ వంతెనపై విధి నిర్వహణలో ఉన్నాడు. ఆ సమయంలో బందరురోడ్డు నుంచి జాతీయ రహదారి వైపు వెళ్తున్న ఒక ఆటో ఆ కార్మికుడిని ఢీకొట్టింది. గాయాలపాలైన అతడ్ని సమీపంలోని వారు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య సీలిమ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విజేతలకు బహుమతి ప్రదానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలోని షాదీఖానా మైదానంలో సంక్రాంతి సందర్భంగా వెలంపల్లి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నెల 10న ప్రారంభమైన టోర్నమెంట్ సంక్రాంతి రోజున ముగిసింది. ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా ఈశ్వర్ సీసీ, సత్తార్ సీసీ జట్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు నిర్ణయించారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఏటా సంక్రాంతికి పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర, ఆర్గనైజర్స్ డీవీ రెడ్డి, శ్రీకాంత్, ప్రభాకర్, కేసరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



గండేపల్లి గ్రామంలో రంగవల్లి



గంగిరెద్దుల విన్యాసాలు, చిత్రంలో ఎమ్మెల్యే ఉదయభాను, విమలాభాను దంపతులు

• ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా సంక్రాంతి పండగను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ సంబరాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు నలు దిశలు చాటే విధంగా సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం శుభదాయకమన్నారు. భావి తరాలకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పే విధంగా ఇలాంటి వేడుకలు జరుపుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా వివిధ కార్యక్రమాలను ఏర్పాటుచేసిన విమలాభాను ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. సంక్రాంతి పండగ అన్ని వర్గాల ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని తెస్తుందన్నారు. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, చిన్నారులకు భోగిపళ్లు, భోగిమంటలు, రంగవల్లుల కార్యక్రమం, గంగిరెద్దుల విన్యాసం, హరిదాసుల సంకీర్తనలు, జడ కోలాట బృంద నృత్యాలు, సంప్రదాయ నృత్యం, సంగీత విభావరి పలువురిని అలరించాయి. పిల్లలకు ఉదయభాను, విమలాభాను దంపతులు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీ ప్రసాద్, పార్టీ పట్టణ మహిళ, ఎస్టీ, మైనార్టీ విభాగాల అధ్యక్షులు మునిని రాజ్యలక్ష్మీ, బద్దూనాయక్, మొహిద్దీన్, అందరు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణంతో పాటు మూడు మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉదయభాను, విమలాభాను దంపతులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులంతా కలిసి చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి.

భక్తిశ్రద్ధలతో గోపూజ

నందిగామ: కనుమ పండగ నేపథ్యంలో రైతులు గోవులను పూజించారు. పండగ పురస్కరించుకొని సోమవారం వాటిని ముస్తాబు చేసి పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, సీతారామాంజనేయ స్వామి ఆలయం, పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపై ఉన్న పలు ఆలయాలతోపాటు మండల పరిధిలోని అంబారుపేటలో సత్యమ్మ ఆలయం, కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, రాఘవాపురం, దాములూరు గ్రామాల్లోని శివాలయాల్లో కనుమ నేపథ్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, తమ లోగిళ్లు ధాన్యపు రాశులతో నిండాలని కోరుకుంటూ రైతులు మనసారా గోమాతను పూజించారు.

పెనుగంచిప్రోలు: పండగలు భారతీయ సంస్కృతిలో భాగమని సర్పంచ్ గూడపాటి లావణ్య తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం ముండ్లపాడులోని జెడ్పీ పాఠశాల ఆవరణలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళల కోలాట నృత్యాలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుంటుపల్లి వాసు, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు విష్ణు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. నవాబుపేట గ్రామంలో స్నేహ సమాజం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో విజేతలకు నిర్వాహకులు రవికుమార్, సభ్యులు బహుమతులు అందజేశారు.

జగ్గయ్యపేట: మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏ గ్రామంలో చూసినా ముత్యాల ముగ్గులు, గంగిరెద్దులు, పతంగుల విన్యాసాలతో గ్రామాలు కళకళలాడాయి. పలు గ్రామాలలో ముగ్గుల పోటీలు, కబడ్డీ, మోకులాగుడు, సంప్రదాయ కోడి పందేలు నిర్వహించారు. బలుసుపాడులోని గురుధాం ఆశ్రమంలో తాత్వికుడు గెంటేల వెంకటరమణ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తెలుగు పండుగుల విశిష్టతను వివరించారు.

షేర్‌మహ్మద్‌పేటలో..

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మోకులాగుడు, క్రికెట్, కుర్చీలాట, పరుగు పందెం, సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఎస్‌ఐ చిన్నబాబు, సబ్‌రిజిస్ట్రార్ బాలాజీ నాయక్‌లు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు నాగమణి, లింగారావు, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, గౌస్‌మియా పాల్గొన్నారు. సంప్రదాయ కోడి పందాలు ఆకట్టుకున్నాయి.



హరిదాసుకు కాళ్లు కడుగుతున్న చిన్నారులు

నందిగామ: సంక్రాంతి పండుగ అంటేనే హరిదాసుల సందడి ఉంటుంది. హరిదాసుల విలువ తెలిసిన చిన్నారులు వారి కాళ్లు కడిగి పూజలు చేస్తున్నారు. పెనుగంచిప్రోలు మండలం కొల్లికూళ్ల గ్రామంలో హరిదాసును పండుగ వేళ కరెన్సీ నోట్లతో గౌరవించారు.

నందిగామ: నియోజకవర్గంలో ఆదివారం సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెలుగు వారికి అత్యంత ప్రీతికరమైన పండుగ కావడంతో కుటుంబసభ్యులతో వేడుకగా జరుపుకున్నారు. సంప్రదాయానికి పెద్ద పీట వేస్తూ, మహిళలు పెద్దపెద్ద రంగవల్లులతో ఇళ్ల ఆవరణలను అలంకరించటం, వాటికి మరింత అందాలను జోడిస్తూ, రంగులు అద్దడం, వాటిని పలు రకాల పూలు, ఫలాలు, ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలతో అలంకరించడంతో వీధులు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి.

నందిగామ పట్టణంలో దాదాపు అర్ధరాత్రి దాటే వరకు మహిళలు, యువతులు, ముగ్గులు వేయడంలో నిమగ్నమయ్యారు.

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సంక్రాంతి రోజు పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. రామలింగేశ్వరనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో విశేష పూజలు చేసి సాయంత్రం సమయంలో జ్యోతి దర్శనం, పడి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పల్లగిరి గుట్టపై త్రిశక్తి పీఠం, స్వయంభు శివాలయం, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. మండలంలోని సత్యమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేశారు.

ఘనంగా కనుమ వేడుకలు

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగలో భాగంగా సోమవారం కనుమ పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ముక్త్యాల, వేదాద్రి, తిరుమలగిరి గ్రామాల్లో భవానీ ముక్తేశ్వర స్వామి, యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో గోమాతకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు ప్రసాద్, నాగరాజు, దాసరి శ్రీరామవరప్రసాదరవు, తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు ఇళ్ల ముంగిట ముత్యాల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. గంగిరెద్దులు, చిన్నారుల పతంగుల విన్యాసాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం ఆయా ఆలయాలకు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ కోడి పందాలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కంచికచర్ల : సంక్రాంతి పర్వదినం సందర్భంగా పలు గ్రామాల్లో ఇంటి ఆవరణలో ఆదివారం తెల్లవారుజామున మహిళలు రంగురంగుల రంగవల్లులు వేశారు. ఆ ముగ్గుల్లో ఆవు పేడతో గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి తెలుగుదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఆ ముగ్గుల్లో చెరుకుగడలు, గంగిరెద్దులు, గాలిపటాలు రంగులతో వేశారు. చిన్నారులు పతంగులు ఎగురవేశారు. గ్రామాల్లో సంప్రదాయంగా కోడి పందేలు వేశారు.

జగ్గయ్యపేట అర్బన్ : సంక్రాంతి పర్వదినాన్ని పట్టణ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. బంధువులు, మిత్రులతో ప్రతిఇల్లు కళకళలాడాయి. రకరకాల పిండివంటలు చేసుకోవటం, నూతన వస్త్రాలు ధరించి వేడుకలు జరుపుకున్నారు. ఉద్యోగులకు, కార్మికులకు, విద్యార్థులకు సెలవు దొరకటంతో సరదాగా గడిపారు. ప్రతి ఇంటిముందు రంగవల్లులు తీర్చిదిద్దుతూ మహిళలు అందంగా అలంకరించారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో పట్టణం పల్లె వాతావరణాన్ని తలపించింది. చిన్నారుల ఆనందానికి హద్దులు లేకుండా పోవటంతో గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు.



షేర్‌మహ్మద్‌పేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ, సబ్‌రిజిస్ట్రార్



షాపుల వద్ద గంగిరెద్దుల సందడి



ముండ్లపాడులో రంగవల్లి



నవాబుపేటలో బహుమతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అ'పూర్వ' సమ్మేళనం



ముండ్లపాడు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ముండ్లపాడు (పెనుగంచిప్రోలు): స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1992–1997 సంవత్సరాల మధ్య 6 నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సోమవారం వారంతా చదువుకున్న పాఠశాలను సందర్శించారు. పాత రోజులు మళ్లీ గుర్తుకు తెచ్చుకోవటంతో పాటు గతానుభవాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదిలో తమ అనుభవాలను పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులును మననం చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఏమి చేస్తున్నారో ఆసక్తిగా పరిచయం చేసుకున్నారు. అనంతరం పెనుగంచిప్రోలులోని తంబరేణి గార్డెన్స్‌లో సామూహిక భోజనాలు చేశారు. ఇలా కలవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏలూరి సైదేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, దామాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెడ్డినాయక్‌తండ (జగ్గయ్యపేట): ఎస్టీ ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ పట్టణ కన్వీనర్ లాహోరు బద్రు నాయక్ పేర్కొన్నారు. గ్రామంలో ఆలిండియా ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం కూడా అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. నాయకులు గుగులోతు హుసేన్, హనుమంతు నాయక్, కృష్ణ నాయక్, లాహోరు హనుమంతు, భూక్యా రమేష్, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేముల భాను ప్రకాష్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత డాక్టర్ ఎం.గురుమూర్తి, డాక్టర్ ఎంవీఎం లక్ష్మి సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 187 నెలలుగా వయోవృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం అభినందనీయం అన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు, దాతల సహకారంతో వృద్ధులకు సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు.

హేతువాద సాహిత్యం విస్తృతం కావాలి



సుబ్బరాజు సంకలనపరచిన మానవవాద గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: హేతువాద సాహిత్యం విస్తృతం కావాలని ప్రజా సాహితి సంస్థ అధ్యక్షుడు దివి కుమార్ అన్నారు. త్రిపురనేని స్మారక సంస్థ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కవి, పరిశోధకుడు బహుభాషా వేత్త త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దివి కుమార్ మాట్లాడుతూ మహిళలోని ఎదుగుదలను స్వాగతించాల్సిన అవసముందన్నారు. సమాజంలోని మూఢాచారాలను ఖండించాలని సూచించారు. శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంశెట్టి అశోక్ కుమార్ మాట్లాడుతూ కవిగా ఆయన సమాజాన్ని ప్రభావితం పరిచే రచనలు చేశారన్నారు. తెనాలి మున్సిపల్ చైర్మన్‌గా, న్యాయవాదిగా ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. హేతువాది పెన్మత్మ సుబ్బరాజు సంకలన పరచిన వ్యాస సంపుటి మానవవాద మార్గం గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎం.అరుణ్ కుమార్, గోళ్ల నారాయణ రావు, జంపాల కృష్ణ కిషోర్, పూర్ణేందు చంద్ర మౌళి, మందగళ్ల సాయికుమార్, కోడాలి రవిబాబు, అరుణాచలం పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



చిన్నారుల ప్రదర్శనలు



బహుమతి ప్రదానం చేస్తున్న వెంకటేష్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని శ్రీవేద గ్రూప్ అధినేత జీ వెంకటేష్ అన్నారు. స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం రాత్రి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేష్ పాల్గొని సంకాంత్రి సంబరాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తొలుత మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వారిలోని సృజనాత్మకత ఉట్టిపడేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలను అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడిన వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రరక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కొండపల్లి మున్సిపాల్టీ 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ ఆర్పీఎఫ్ పోలీసులు, రైల్వే సిబ్బంది సహకారంతో 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఆదిలాబాద్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు కార్యాలయం ప్రారంభోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ పట్టణ మైనార్టీ విభాగం నూతన కార్యాలయం మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ సోమవారం తెలిపారు. స్థానిక పోస్టాఫీసు సెంటర్‌లోని చారుగుండ్ల కొండ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముస్లిం మైనార్టీ పెద్దలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వెంకన్న సన్నిధిలో ఘనంగా గోదా కల్యాణం

మైలవరం: మైలవరంలోని శ్రీద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ గోదాదేవి సమేత శ్రీ రంగనాయక మహాలక్ష్మీ వార్ల కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు. ద్వారకా తిరుమల దేవస్థాన కమిటీ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తనయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వినియోగం జరిగింది.